ఆపరేటర్ల తప్పిదం.. అర్హులకు శాపం

ప్రజాపాలన దరఖాస్తుదారులకు తప్పని తిప్పలు

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి వాకాటి కరుణ (ఫైల్)



- ఆన్‌లైన్ నమోదులో పొరపాట్లు
- సవరణకు అవకాశం లేక ఇబ్బందులు
- అందరికీ అందని గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలు
- ఎడిట్ ఆప్షన్ ఇవ్వడమే పరిష్కారమంటున్న సిబ్బంది

రఘునాథపల్లి, జూలై 30: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలలోని గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలు అర్హులందరికీ అందడం లేదు. ప్రజాపాలనలో తీసుకున్న దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే క్రమంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌లు చేసిన తప్పిదాలు కొంత మంది అర్హుల పాలిట శాపంగా మారుతున్నాయి. నిబంధనల ప్రకారం అన్ని అర్హతలు ఉన్నప్పటికీ జిల్లాలో 200 యూనిట్‌లలోపు విద్యుత్‌ను ఉచితంగా పొందే అవకాశంతో పాటు మహాలక్ష్మి పథకం ద్వారా రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను పొందే అవకాశాన్ని చాలా మంది కోల్పోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది డిసెంబరు 28 నుంచి జనవరి 6 వరకు గ్రామాలలో ప్రజాపాలన సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించింది. అయితే వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో అనేక తప్పులు దొర్లాయి. మీటర్ సర్వీస్ నంబర్లు, గ్యాస్ ఐడీ నంబర్లు ఎంట్రీ చేయడంలో అనేక తప్పిదాలు జరిగాయి. వాటిని సవరించేందుకు అవకాశం లేకపోవడంతో అర్హులైన కొందరికి ఇబ్బందులు తప్పడం లేదు.

ఎడిట్ ఆప్షన్ లేక..

ప్రజాపాలన దరఖాస్తులను సవరించేందుకు ప్రభుత్వం ఇటీవల అవకాశం కల్పించింది. మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి వాటిని సవరించే కార్యక్రమం చేపట్టింది. అయితే సవరణలో కొన్ని పొరపాట్లను మాత్రమే సవరించుకునేందుకు అవకాశం ఉంది. ఎక్కువ శాతం దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉంటున్నాయి. ఎడిట్ ఆప్షన్ లేకపోవడంతో ఈ సమస్య తలెత్తుతోంది. ఫలితంగా అనేక మందికి సంక్షేమ పథకాలు అందడం లేదు. సమస్య పరిష్కారానికి ఎడిట్ ఆప్షన్ ఇవ్వడం ఒక్కటే మార్గమని సిబ్బంది అంటున్నారు. కేవలం మిస్ మ్యాచ్‌డ్ అని ఉన్న వాటికి ఎడిట్ ఆప్షన్ ఉండడంతో వాటిని సరి చేస్తున్నారు. అంటే ఒక దరఖాస్తుదారుడి నెంబరుకు ఇంకొక దరఖాస్తుదారుడి నెంబరు నమోదు చేయడం అన్న మాట. కానీ ఇలా లేనివాటిని కూడా సరి చేసేందుకు ఎడిట్ ఆప్షన్ తప్పనిసరి అంటున్నారు. ఎడిట్ ఆప్షన్ లేక తప్పులు సరి చేయకపోవడంతో సమస్య పరిష్కారం కోసం అర్హులందరూ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారని చెబుతున్నారు.

తొందరపాటు వల్లే లోపాలు

ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసేందుకు ప్రైవేటు వ్యక్తులను నియమించి ఒక్కో దరఖాస్తుకు ఇంత అని చెప్పడంతో ఎక్కువ దరఖాస్తులు ఎంట్రీ చేసేందుకు పోటీ పడ్డ క్రమంలో అన్ని తప్పులు దొర్లినట్లుగా ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దరఖాస్తులో గృహజ్యోతికి, మహాలక్ష్మికి టిక్ మార్క్ చేసినా..కొందరికి డేటా ఎంట్రీ ఆపరేటర్‌లు నాట్ అప్లై అని నమోదు చేశారు. దీంతో అర్హులైన వారికి అన్యాయం జరుగుతోంది. ప్రజాపాలన దరఖాస్తుల్లో దొర్లిన తప్పులను సవరించుకునేందుకు ఎడిట్ ఆప్షన్ ఇవ్వాల్సిన అవసరం ఉంది.



రఘునాథపల్లిలో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీవో హాషీం (ఫైల్)

గృహజ్యోతి దరఖాస్తులకు ఎడిట్ ఆప్షన్..

గృహజ్యోతి దరఖాస్తుదారుల సమస్యను పరిష్కరించడానికి ఎట్టకేలకు ఎడిట్ ఆప్షన్ ఇచ్చారు. దీంతో చాలా వరకు ఆన్‌లైన్ ప్రక్రియలో జరిగిన తప్పులను సవరించే అవకాశం లభించింది. ఫలితంగా దాదాపు 90 శాతం మంది వినియోగదారులకు జీరో కరెంట్ బిల్ వస్తోంది. కాని మహాలక్ష్మి పథకం ద్వారా రూ.500లకే గ్యాస్ సిలిండర్ దరఖాస్తుదారులకు మాత్రం ఎడిట్ ఆప్షన్ ఇవ్వలేదు. ప్రజాపాలనలో లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నపుడు ఇచ్చిన గ్యాస్ ఏజెన్సీకి చెందిన ఏడు అంకెల నెంబర్‌ను మాత్రమే ఇచ్చారు..ఆన్‌లైన్ నమోదులో జరిగిన పొరపాటుతో కొందరు లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ రాకపోవడంతో గ్యాస్ ఏజెన్సీకి చెందిన 13 అంకెల నెంబర్‌ను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసినప్పటికి నాట్ మ్యాచింగ్ అని వస్తోంది. దీంతో గ్యాస్ సబ్సిడీ పొందేందుకు మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన లబ్ధిదారులు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

ఎడిట్ ఆప్షన్ ఇస్తేనే ఇబ్బందులు తొలుగుతాయి

జి.శ్రీనివాసులు, ఎంపీడీవో- రఘునాథపల్లి



ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసేటప్పుడు దొర్లిన తప్పులను సవరించేందుకు ఎడిట్ ఆప్షన్ ఇవ్వకపోవడం వల్ల తప్పులను సరిచేయలేకపోతున్నాం. గృహలక్ష్మి దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదులో జరిగిన తప్పులను ఎడిట్ ఆప్షన్ ద్వారా చాలా వరకు సవరించగలిగాం. మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500లకే గ్యాస్ సిలిండర్ దరఖాస్తులు కొన్ని నాట్ అప్లై అని నమోదు చేయడంతో దొర్లిన తప్పులను సవరించడానికి సరైన ఎడిట్ ఆప్షన్‌ను ఇప్పటివరకు ఇవ్వకపోవడంతో వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ సబ్సిడీ సమస్య రాష్ట్ర వ్యాప్తంగా ఉంది. సరైన ఎడిట్ ఆప్షన్ వస్తేనే తప్పులను సరి చేసేందుకు వీలుంటుంది.

అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రసంగం



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి, జూలై 30 : పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి మంగళవారం అసెంబ్లీలో ప్రసంగించారు. తన నియోజకవర్గంలో ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో చెట్ల కిందనే ప్రభుత్వ పాఠశాలలు కొనసాగుతున్నాయని, మరుగుదొడ్లు లేని బడులు ఇంకా ఉన్నాయని ఆవేదనం వ్యక్తం చేశారు. దేవాదుల కాల్వల్లో నీరు పారడంలేదని, 30 కిలోమీటర్ల మేర చెట్లు బాగా పెరిగితే తాను సొంత డబ్బులు పెట్టి తొలగించానని అన్నారు. ప్రభుత్వం రూ. 2 లక్షలు ఏక కాలంలో రుణమాఫీ చేసినందుకు రైతులు సంతోషంతో ఉన్నారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సర్కార్ బడులను అభివృద్ధి చేయలేదని విమర్శించారు. విద్యారంగాన్ని పటిష్టపరిచేందుకు ప్రతీ నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమని అన్నారు. అవి ఏర్పాటైతే పేద విద్యార్థులు చదువు కోనడానికి ఎంతో ఉపయోగపడుతాయని అన్నారు. దేవాదుల ప్రాజెక్టు కింద మంజూరైన పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ల పనులు నత్తనడకన సాగుతున్నాయని, మన ప్రభుత్వం పూర్తి చేస్తే ప్రజలంతా మన వెంట ఉంటారని అభిప్రాయం వ్యక్తం చేశారు.

అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ

- రూ.22.93 లక్షల క్రాకర్స్ సీజ్
- యజమానిపై కేసు నమోదు



సీజ్ చేసిన బాణసంచా వద్ద పోలీసులు

జనగామ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా పెద్ద మొత్తంలో నిల్వ ఉంచిన బాణసంచాను టాస్క్‌ఫోర్స్, జనగామ పోలీసులు మంగళవారం సాయంత్రం సీజ్ చేశారు. ఈ సందర్భంగా జనగామ సీఐ రఘుపతిరెడ్డి మాట్లాడుతూ.. జనగామ మండలం ఓబులకేశవాపూర్ శివారులోని అనుగ్రహ ఫైర్ క్రాకర్స్ షాప్‌పై మంగళవారం దాడులు చేశామని, అనుగ్రహ ఫైర్ క్రాకర్స్ షాపునకు అనుమతులు లేవని, ఏ విధమైన భద్రతా ప్రమాణాలు పాటించలేదని అన్నారు. నాలుగు కంటైనర్లతో పాటు మూడు బిల్డింగులలో ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండా బాణసంచా నిల్వ ఉంచారని తెలిపారు. 2885 కాటన్ బాక్సుల రూ.22,93,227 విలువైన బాణాసంచాను సీజ్ చేయడంతో పాటు యజమాని దారం సత్యనారాయణపై కేసు నమోదు చేశామని తెలిపారు. దాడులలో టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీధర్, జనగామ ఎస్సై రాజేశ్, కానిస్టేబుళ్లు భాస్కర్, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీ రిటర్న్ దాఖలుకు నేడే ఆఖరు తేదీ

వివరాలు 5లో..

చర్చిని కూల్చిన రెవెన్యూ సిబ్బంది

ఆందోళనకు దిగిన క్రిస్టియన్లు



నేలమట్టమైన చర్చిని చూపుతున్న క్రిస్టియన్లు

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 30: మండలంలోని నమిలిగొండ గ్రామ శివారులో సర్వే నెంబరు 175లో నిర్మించిన ఫెయిత్‌హోం మినిస్ట్రీస్ చర్చిని మంగళవారం రెవెన్యూ సిబ్బంది జేసీబీతో కూల్చి వేయించారు. విషయం తెలుసుకున్న క్రిస్టియన్లు, సంఘ పెద్దలు కూల్చివేసిన చర్చి వద్దకు చేరుకొని ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పాస్టర్లు శ్యాంసుందర్, ఫిలప్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గాదె శ్రీధర్, గాదె రాజు మాట్లాడారు. 2010లో రేకుల షెడ్‌ను నిర్మించుకొని క్రైస్తవుల ఆధ్వర్యంలో చర్చిని ఏర్పాటు చేసుకున్నామన్నారు. పదిహేను ఏళ్లుగా చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమీపంలోని గ్రామాలకు చెందిన భక్తులు సైతం చర్చిలో ప్రార్థనలు చేస్తున్నారని తెలిపారు. సదరు స్థలాన్ని చర్చికి కేటాయించాలని అధికారులకు విన్నవించామన్నారు. ఫిబ్రవరి 25, 2015లో సదరు స్థలంలో 20గుంటల భూమిని చర్చికి కేటాయిస్తున్నట్లు గ్రామ పంచాయతీలో తీర్మానం చేశారని తెలిపారు. అదేవిధంగా ఇదే సర్వే నెంబర్‌లో 30గుంటల భూమిని శివాలయానికి, 10గుంటల భూమిని మజీదుకు కేటాయిస్తూ తీర్మానం చేశారన్నారు. చర్చి నిర్మాణ విషయమై ఇటీవల కలెక్టర్‌కు, ఎమ్మెల్యే కడియం శ్రీహరిలకు వినతి పత్రాలు అందించామని తెలిపారు. ఎవరో గిట్టనివారు చేసిన ఫిర్యాదుతో రెవెన్యూ సిబ్బంది చర్చిని కూల్చివేయించారని ఆరోపించారు. సంఘ పెద్దలకు, పాస్టర్లకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కూల్చివేయడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు.

కాగా, పదిహేనేళ్లుగా ప్రార్థన చేసుకుంటున్న చర్చిని రెవెన్యూ అధికారులు అన్యాయంగా కూల్చివేశారని, ఈ విషయమై న్యాయం చేయాలని కోరుతూ పాస్టర్లు ఆర్డీవో వెంకన్నకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పాస్టర్లు వెంకటస్వామి, ప్రభుచరణ్, పాల్, ప్రవీణ్, రవి, జినుక దిలీప్, రాజు, ప్రణయ్, కరుణాకర్, రాంచందర్, కనుకయ్య, వంశీ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ

కలెక్టర్ రిజ్వాన్ బాషా



నమూనా చెక్కును విడుదల చేస్తున్న కలెక్టర్

జనగామ రూరల్, జూలై 30: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అవుతుందని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ ఆవరణలో మంగళవారం రెండో విడత రుణమాఫీ కార్యక్రమాన్ని ప్రారంభించగా జనగామ కలెక్టరేట్‌లో కలెక్టర్ రిజ్వాన్ బాషా ప్రారంభించారు. కలెక్టర్ రైతులతో కలిసి సీఎం ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ఆందోళన చెందవద్దని, రుణమాఫీలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఇందుకు గ్రామాల వారీగా షెడ్యూల్ సిద్ధం చేయాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. బ్యాంకు అధికారులు, వ్యవసాయ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లాలో మొదటి విడతలో 26,374 మంది రైతులకు రూ. 149.35 కోట్లు, రెండో విడతలో 17,419 మంది రైతులకు 180 కోట్లు రెండు విడతల్లో మొత్తం రూ. 330 కోట్ల రుణమాఫీ జరిగిందని తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, రోహిత్ సింగ్‌లతో కలిసి 180 కోట్ల రుణమాఫీ నమూనా చెక్కును రైతులకు అందజేశారు. కార్యక్రమంలో డీఏవో వినోద్ కుమార్, ఆర్డీవో కొమురయ్య, డీసీవో రాజేందర్ రెడ్డి, బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

బాలాజీనగర్‌లో నాలా పరిశీలన

జిల్లా కేంద్రంలోని బాలాజీనగర్‌లో నాలాను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు నీరు, వర్షపు నీరు ఎక్కడా ఆగకుండా చర్యలు చేపట్టాలని, అంటు వ్యాధులు ప్రబలకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ సుధ, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ కుంట పరిశీలన

జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంటను మంగళవారం కలెక్టర్ రిజ్వాన్ బాషా అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ కుంట ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, కుంటలో దుస్తులు ఉతుకనీయకుండా చూడాలని, నిబంధనల ప్రకారం వ్యాపార సంస్థల ప్రచార బోర్డులకు చార్జీలు వసూలు చేయాలని, కుంట కట్టపై మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ వాంకుడోత్ అనిత, తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఇన్‌చార్జి ధనుంజయ్



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

జనగామ రూరల్, జూలై 30: కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే బీసీ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఇన్‌చార్జి ముంగీ ధనుంజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. చివరికి అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధనుంజయ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు బీసీలకు 42 శాతం రిజర్వేషన్, బీసీ సబ్ ప్లాన్, గొల్ల కుర్మలకు రెండో విడత గొర్రెలను పంపిణీ చేస్తామని, మత్స్యకారులకు సబ్సిడీతో చేప పిల్లలను పంపిణీ చేస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో బాల్నె శ్రీనివాస్, కొంతం శ్రీనివాస్, చౌదరపల్లి సతీష్, రామకోటి, పిట్టల సత్యం, తదితరులు పాల్గొన్నారు.

అయ్యో.. రామా..!

- అయోధ్య సరయూ నదిలో జనగామ యువతి గల్లంతు
- బాలరాముడి దర్శనానికి వెళ్లిన క్రమంలో ఘటన
- నదీస్నానం చేస్తూ కొట్టుకుపోయిన ఐదుగురు
- నలుగురిని కాపాడిన రెస్క్యూ టీమ్

వివరాలు 5వ పేజీలో



తేజశ్రీ (ఫైల్)

డాక్టర్ సుగుణాకర్‌రాజు బదిలీ

తొర్రూరు ఏరియా ఆస్పత్రికి ట్రాన్స్‌ఫర్

24 ఏళ్లపాటు జనగామలో సుదీర్ఘంగా విధులు



డాక్టర్ చంద్రమౌళికి బాధ్యతలు అప్పగిస్తున్న సుగుణాకర్‌రాజు

జనగామ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త (డీసీహెచ్ఎస్) డాక్టర్ సుగుణాకర్‌రాజు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీలలో భాగంగా ప్రభుత్వం ఆయనను మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ఏరియా ఆస్పత్రికి బదిలీ చేసింది. జనగామలో సుగుణాకర్‌రాజు సుదీర్ఘకాలంగా పనిచేశారు. 2000 సంవత్సరం జూలై 5న సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా విధుల్లో చేరారు. రెండు నెలల్లోనే ఆర్ఎంవోగా పదోన్నతి దక్కింది. సరిగ్గా 24 ఏళ్ల పాటు ఆయన ఇక్కడే వివిధ హోదాల్లో పనిచేస్తూ వచ్చారు. 2021 ఆగస్టులో జనగామ ఏరియా ఆసుపత్రి, చంపక్‌హిల్స్‌లోని మాతాశిశు ఆసుపత్రికి సూపరింటెండెంట్‌గా, బచ్చన్నపేట, జఫర్‌గడ్, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి సీహెచ్‌సీలకు జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్తగా పనిచేశారు. జనగామలో మెడికల్ కాలేజీ ప్రారంభం కావడం, జిల్లా ఆస్పత్రి, ఎంసీహెచ్, మెడికల్ కాలేజీ పరిధిలోకి వెళ్లడంతో 2023 డిసెంబరులో ఈ రెండు ఆస్పత్రుల సూపరింటెండెంట్ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. కాగా.. ప్రస్తుతం సివిల్ సర్జన్ హోదాలో జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్తగా మాత్రమే కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆయన స్థానంలో డీసీహెచ్ఎస్‌గా డాక్టర్ చంద్రమౌళి మంగళవారం బాధ్యతలను స్వీకరించారు.

నేడు డయల్ యువర్ డీఎం

జనగామ రూరల్, జూలై 30: జనగామ ఆర్టీసీ డిపో పరిధిలో బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తామని డిపో మేనేజర్ ఎస్. స్వాతి ఒక ప్రకటనలో తెలిపారు. జనగామ ఆర్టీసీ పరిధిలోని ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా ఫిర్యాదు చేయవచ్చని, సూచనలు, సలహాలు కూడా ఇవ్వొచ్చని అన్నారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఉంటుందని సందేహాలు, సూచనల కోసం 9959226050 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరికి 20 ఏళ్ల జైలు

డోర్నకల్, (మహబూబాబాద్ జిల్లా), జూలై 30 : గంజాయి అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరికి మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ 20 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు వెల్లడించారు. డోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని మరిపెడ మండలం తండ ధర్మారానికి చెందిన బానోత్ కిరణ్‌కుమార్ అలియాస్ దేవా, భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన బాదావత్ సూర్య అనే ఇద్దరు వ్యక్తులు ట్రాక్టర్ ద్వారా గంజాయి తరలిస్తున్నారు. డోర్నకల్‌లో 2021 జూలై 7న అప్పటి డోర్నకల్ ఎస్సై భద్రునాయక్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానస్పదంగా వస్తున్న ఆ ట్రాక్టర్‌ను ఆపి తనిఖీ చేశారు. ట్రాక్టర్ ట్రాలీకింద ప్రత్యేకంగా తయారు చేయించిన అరలో 150 గంజాయి ప్యాకెట్లను పోలీసులు గుర్తించారు. ఒక్కో ప్యాకెట్ రెండు కిలోల బరువు ఉండగా 150 ప్యాకెట్లలో 3 క్వింటాళ్ల గంజాయి ఉంది. సుమారు దీని విలువ రూ.30 లక్షల వరకు ఉంటుందని అప్పటి ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి వెల్లడించారు. వాటిని స్వాధీనం చేసుకుని నిందితులైన కిరణ్‌కుమార్, సూర్యను అదుపులోకి తీసుకుని అప్పటి డోర్నకల్ సీఐ ఇస్లావత్ శ్రీనివాస్‌నాయక్ వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పీపీ చిలుకమారి వెంకటేశ్వర్లు కేసుకు సంబంధించిన వాదనలు వినిపించారు. ఈ కేసులో విచారణ అధికారిగా ఉన్న అప్పటి సీఐ ఇస్లావత్ శ్రీనివాస్ సాక్షాన్ని ఆధారంగా తీసుకున్న మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ నిందితులైన బానోత్ కిరణ్‌కుమార్, బాదావత్ సూర్యకు 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు డోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

తరిగొప్పుల: జనగామ జిల్లా తరిగొప్పుల మండలం ఎన్యానాయక్‌తండా ఎక్స్‌రోడ్డు వద్ద గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను తరిగొప్పుల పోలీసులు మంగళవారం అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. కేసు వివరాలను జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. తరిగొప్పుల ఎస్సై అయ్యాల శ్వేత ఆధ్వర్యంలో పోలీసులు ఎన్యానాయక్ తండా ఎక్స్‌రోడ్డు వద్ద తనిఖీలు చేస్తున్న క్రమంలో అనుమానాస్పందంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద 1.565 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వీర్లగడ్డ తండాకు చెందిన భూక్య రమేష్ ఆలియాస్ రమ్మీ, జనగామ జిల్లా తరిగొప్పులకు చెందిన మహ్మద్ జలీల్‌ను విచారించగా భూక్య రమేష్ కరీంనగర్ నుంచి గంజాయి తీసుకువచ్చి జలీల్‌కు విక్రయిస్తుండగా జలీల్ తరిగొప్పుల చుట్టుప్రక్కల గ్రామాల యువకులకు ప్యాకెట్ల రూపంలో రూ. 100 నుంచి రూ.500లకు విక్రయిస్తున్నాడని తేలింది. ఈ విషయమై వరంగల్ సీపీ అంబర్ కిషోర్, జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఎస్సై శ్వేతను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ పార్థసారధి, నర్మెట సీఐ సాయిరమణ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జనగామ జిల్లా తరిగొప్పుల పోలీసుస్టేషన్‌లో నిందితులను చూపుతున్న డీసీపీ రాజమహేంద్ర నాయక్

ఎలక్ట్రిక్ లోకో పీవోహెచ్‌పై ఆశలు

● ఎంపీలు చొరవ చూపి కాజీపేటలో నిర్మిస్తే 10 వేలమందికి ఉపాధి ● సాధ్యాసాధ్యాలపై రైల్వే అధికారుల పరిశీలన


కాజీపేట ఎలక్ట్రికల్ లోకోషెడ్

కాజీపేట, జూలై 30 : దక్షిణ భారత రైల్వేలను కలిపే కాజీపేట రైల్వే జంక్షన్‌లో ఎలక్ట్రిక్ పీవోహెచ్ షెడ్ నిర్మాణంపై ఉద్యోగుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. ప్రస్తుతం కాజీపేటలోఉన్న ఎలక్ట్రికల్ లోకోషెడ్ దక్షిణ మధ్య రైల్వేలోనే అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇక్కడ ఎలక్ట్రికల్ లోకో ఇంజన్‌ల నిర్వహణ, మరమ్మతులు చేసే ఒక మోటివ్ పవర్ డిపో.. దీనికి అనుసంధానంగా పీవోహెచ్ నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ ఎలక్ట్రికల్ పీరియాడికల్ ఓవరాలింగ్ (పీఓహెచ్) కాజీపేటలోనే నిర్మాణం జరుగుతోంది. కాజీపేటలో నిర్మాణం జరిగితే ఇక్కడి రూపురేఖలు మారుతాయని రైల్వే ఉద్యోగాల సంఘాలు అంటున్నాయి.. ఈ పీవోహెచ్ కాజీపేటకు తీసుకురాగలిగితే కాజీపేటను డివిజన్‌గా ఉన్నతీకరించడానికి పెద్దగా ప్రయాసపడాల్సిన పనిలేదని పలువురు అంటున్నారు. ఇప్పటికే కాజీపేటలో వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ వ్యాగన్ ఓవరాలింగ్ పరిశ్రమ నిర్మాణపనులు చకచకా జరుగుతున్నాయి. మరోవైపు రైల్వేస్టేషన్‌లో అమృత్‌భారత్‌లో నిర్మాణపనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఇక్కడ ఎలక్ట్రికల్ పీవోహెచ్ నిర్మిస్తే కాజీపేట రైల్వే కార్మికులతో కళకళలాడుతూ పాత శోభను సంతరించుకుంటోంది. ఇక్కడ పీవోహెచ్ నిర్మిస్తే సుమారు 10 వేల మందికి జీవనోపాధి లభిస్తుంది. కాజీపేటకు ప్రాధాన్యం పెరుగుతుంది. సాధ్యాసాధ్యాలపై రైల్వే అధికారులు ఇక్కడికి వచ్చి ఈ మధ్యనే పరిశీలించారు. స్థలం, రైల్వే స్టాఫ్ పొజీషన్, నీటి సౌకర్యం తదితర అంశాలపై ఒక నివేదిక తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది. అన్ని అనుకూల అంశాలుగా ఉన్న కాజీపేటలోనే పీవోహెచ్ నిర్మించాలని రైల్వే కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఎలక్ట్రికల్ పీవోహెచ్ అంటే..

ఎలక్ట్రికల్ పీరియాడికల్ ఓవరాలింగ్ అంటే (పీవోహెచ్) ఎలక్ట్రిక్ లోకోలను ఒక్కొక్క భాగాలను విడదీసి ఓవరాలింగ్ చేసి కొత్త లోకో ఇంజన్ తయారు చేసే ప్రక్రియ. లోకోషెడ్‌లో మరమ్మతు చేసిన లోకో ఇంజన్‌లు ఇచ్చిన షెడ్యూల్ ట్రిప్పులు పూర్తయిన తర్వాత లోకోల మోడల్‌ను బట్టి 5,10,15 ఏళ్లకోసారి ఓవరాలింగ్ కోసం పీవోహెచ్ షెడ్‌కు రావల్సిందే. ఈ తతంగమంతా చేసే దానినే ఎలక్ట్రికల్ పీవోహెచ్ అంటారు. ఇలా పీవోహెచ్‌కు వచ్చిన లోకోల మెయింటనెన్స్, ఇన్‌స్పెక్షన్ చేయకముందే బయటకు పంపడం కుదరదు. ఒక విధంగా చెప్పాలంటే లోకోలను పరిశీలించి ఒక్కొక్కభాగాన్ని విడదీసి పనికొచ్చే భాగాలతో కొత్త లోకో తయారు చేయడమన్న మాట. అలాంటి ఎలక్ట్రికల్ పీవోహెచ్‌ను కాజీపేటలో నిర్మించడానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. కాజీపేటలోనే నిర్మించడానికి అనుకూల అంశాలు ఎక్కువగా ఉన్నాయనే చర్చ ప్రారంభమైంది. ఇక్కడ ఎలక్ట్రికల్ లోకో షెడ్ ఉండటం, ఇక్కడే ప్రస్తుతం దాదాపు 200 లోకోలకు మరమ్మతులు చేయడం, కావాల్సినంత స్థలం, నీరు, రవాణా అనుకూలంగా ఉండటమే ప్రధాన అంశం. పైగా దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్‌కు మంచి రైల్, రోడ్ కనెక్టివిటీ ఉండడమే కూడా ప్రధానం అంశంగా చెప్పొచ్చు. కాచిగూడ, కాజీపేట డీజిల్ లోకోషెడ్, ఎలక్ట్రికల్ షెడ్, గుత్తి, గుంతకల్ విజయవాడలో ఉన్న లోకోషెడ్‌లలో మొత్తంగా 1,195 లోకోలు ఉన్నాయి. ఇక్కడ మరమ్మతులు అయిన లోకోలను పీవోహెచ్‌కు తరలించడానికి పంజాబ్‌లోని కపుర్తాలకు, చెన్నైలోని పెరంబదూర్ తరలించి ఓవరాలింగ్ చేయాల్సి వస్తుంది. రైల్వే బోర్డు ఆదేశాల ప్రకారం జోన్‌లో 800 లోకోలు ఉంటేనే పీవోహెచ్ నిర్మాంచాలని ఆదేశాలు ఉన్నాయి. మన జోన్‌లో 1,195 లోకోలు ఉన్నాయి. రైల్వే బోర్డు ఆదేశాలతో పీవోహెచ్ కాజీపేటలో కనుక నిర్మిస్తే లోకోలను తరలించే వ్యయాన్ని, సమయాన్ని ఆదా చేసుకోవడమే కాకుండా రైల్వేకు మంచి లాభం. అన్ని అర్హతలు ఉన్న కాజీపేటలోనే పీవోహెచ్ నిర్మించాలని రైల్వే కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ సమయంలో జిల్లా ఎంపీలు పట్టుపడితే కచ్చితంగా కాజీపేటకు వస్తుందని రైల్వేకార్మిక సంఘాలు, ఉద్యోగులు అంటున్నారు. ఎంపీలు చొరవచూపి ఇక్కడే నిర్మించేందుకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఐటీ రిటర్న్ దాఖలుకు నేడే ఆఖరు

వరంగల్ చౌరస్తా, జూలై 30: ఆదాయ పన్ను రిటర్న్‌కు బుధవారం ఆఖరి గడువని అధికారులు పేర్కొంటున్నారు. గడువులోపు ఐటీ రిటర్న్ దాఖలు చేయని వారు పన్ను చెల్లింపుదారులు తమ రిటర్న్‌లను రూ.5వేల పెనాల్టీతో డిసెంబరు 31 వరకు దాఖలు, రూ.వెయ్యి పెనాల్టీతో డిసెంబరు 31 వరకు చేసుకునే అవకాశాన్ని ఆదాయపు పన్ను శాఖ అవకాశమిచ్చింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రతీ ఏటా ఆదాయ పన్ను శాఖకు వ్యాపార, వాణిజ్య, ఉత్పత్తి సంస్థలకు చెందిన వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు పన్ను చెల్లించే వారు 87వేల మంది ఉన్నారు. వీరు ప్రతీ ఏటా తమ ఆదాయాన్ని బట్టి తమ ఏడాది లాభ నష్టాలతో కూడిన వివరాల పత్రాలను ఆదాయపన్ను శాఖకు సమర్పిస్తారు.

ఉమ్మడి జిల్లాలో 1,500 మంది డిఫాల్టర్లు

వరంగల్ ఉమ్మడి జిల్లాలో దాదాపు 1,500 మంది డిఫాల్టర్లు ఉన్నారని సమాచారం. ఆదాయపన్ను శాఖ ప్రతీ ఏటా పన్ను చెల్లింపు ఐటీ రిటర్న్ దాఖలులో 1,500 మంది డిఫాల్టర్లు ఉన్నారని గుర్తించినట్లు సమాచారం. వీరికి నోటీసులు కూడా జారీ చేసినట్లు తెలిసింది. ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం ఉద్యోగులకు, చిన్న తరహా వ్యాపారులకు రూ.3లక్షల నుంచి రూ.6లక్షల వరకు ఉన్న వారికి 5శాతం పన్ను, రూ.6లక్షల నుంచి రూ.9లక్షల వరకు 10శాతం, రూ.9లక్షల నుంచి రూ.12లక్షల వరకు 15 శాతం, రూ.12లక్షల నుంచి రూ.15లక్షల వరకు 20శాతం, రూ.15లక్షల ఆదాయం దాటిన ప్రతీ ఒక్కరు తమ ఆదాయంలో 30శాతాన్ని పన్నును ఆదాయ పన్ను శాఖకు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

తప్పులతో దాఖలు చేస్తే కఠిన చర్యలు : మహేందర్‌బాబు, ఉమ్మడి జిల్లా ఆదాయపన్ను శాఖ అధికారి

తప్పులతో దాఖలు చేస్తే కఠిన చర్యలు తప్పవు. కొందరు ఆదాయపు పన్ను చెల్లింపుదారులు దాఖలు పత్రాల్లో తప్పుడు సమాచారంతో మినహాయింపులు డిడెక్షన్లు చూపిస్తున్నారు. రావాల్సిన దానికన్నా ఎక్కువ రీఫండ్‌ను పొందుతున్న విషయం ఆదాయపన్ను శాఖ విభాగం దర్యాప్తులో తేలింది. తప్పుడు రిటర్న్ దాఖలు చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయి.

సీనియర్ వైద్యుడు కుమారస్వామి మృతి

సూపరింటెండెంట్ విధుల్లో చేరాల్సిన ముందు రోజే ఘటన


డాక్టర్ బి.కుమారస్వామి

వరంగల్ మెడికల్, జూలై 30: భద్రాద్రి కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రి పూర్వ సూపరింటెండెంట్, మంచిర్యాల ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ అయిన డాక్టర్ బోడ కుమారస్వామి సోమవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. హనుమకొండ పెద్దమ్మగడ్డ ప్రాంతానికి చెందిన ఆయన గతంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సర్జికల్ విభాగంలో సుదీర్ఘకాలం పాటు సేవలు అందించారు. ఆ తరువాత పదోన్నతిపై భద్రాద్రి కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా వెళ్లారు. ప్రస్తుతం జరుగుతున్న సాధారణ బదిలీల్లో మంచిర్యాల ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. అయితే మంగళవారం మంచిర్యాలలో జాయిన్ కావాల్సి ఉండగా, సోమవారం రాత్రి ఆయన తన నివాసంలో ఆకస్మికంగా మృతి చెందారు. దీంతో పెద్దమ్మగడ్డ శ్మశాన వాటికలో మంగళవారం కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించగా.. ఆయన మృతి పట్ల పలువురు ఐఎంఏ వైద్యులు, ప్రభుత్వ వైద్యులు సంతాపం ప్రకటించారు. ఇదిలా ఉంటే కొత్తగూడేనికి చెందిన కొందరి వేధింపుల వల్ల తన భర్త తీవ్ర ఆవేదనకు గురై మృతిచెందాడని ఆయన భార్య విలపించిన ఓ వీడియో వైరల్‌గా మారింది.

వరంగల్ వైద్యుడికి ప్రపంచస్థాయి గుర్తింపు


డాక్టర్ రమేశ్

వరంగల్ మెడికల్, జూలై 30: న్యూరో సైన్స్ అల్జీమర్స్ వ్యాధులపై పరిశోధనలు జరిపిన వరంగల్ వైద్యుడికి ప్రపంచస్థాయి గుర్తింపు లభించింది. అమెరికాకు చెందిన నాసా సైంటిస్ట్ అవార్డు ప్రదానం చేసింది. వరంగల్ జిల్లా నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో బయో కెమిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కందిమల్ల రమేశ్‌కు ఈ అరుదైన గౌరవం దక్కింది. డాక్టర్ రమేశ్ గతంలో కేఎంసీలో కూడా పనిచేశాడు. అనంతరం అమెరికాకు వెళ్లి పదేళ్లు అక్కడి మెమోరీ యూనివర్సిటీలో హెల్త్ సైన్సెస్ విభాగంలో అనేక పరిశోధనలు చేశారు. న్యూరో సైన్స్ విభాగంతోపాటు అల్జీమర్స్ వ్యాధిపై చేసిన పరిశోధనలకు గాను ప్రపంచస్థాయి గుర్తింపు లభించింది. ఈ వ్యాధులపై పరిశోధన చేసిన ప్రపంచస్థాయి శాస్త్రవేత్తల్లో ఇద్దరు ఉండగా, భారతదేశం నుంచి డాక్టర్ రమేశ్ ఆస్థానాన్ని దక్కించుకున్నారు. రెండు రోజుల కిందట అమెరికా నాసా సైంటిస్ట్ అవార్డును రమేశ్‌కు ప్రకటించింది.

స్కూల్ బస్సును ఢీకొన్న లారీ

మడికొండ వద్ద ఘటన.. విద్యార్థులకు స్వల్పగాయాలు


లారీ ఢీకొని ధ్వంసమైన స్కూల్ బస్సు

మడికొండ, జూలై 30: స్కూల్ బస్సును లారీ ఢీకొనడంతో పలువురు విద్యార్థులకు గాయాలైన ఘటన మడికొండలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ జయరాజ్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక సక్సెస్ స్కూల్‌కు చెందిన బస్సు విద్యార్థులతో మడికొండ నుంచి ధర్మసాగర్ వైపు వెళుతోంది. అదే సమయంలో మంచిర్యాలకు చెందిన లారీ వరంగల్ నుంచి సిరిసిల్లకు వెళ్తున్న క్రమంలో వాల్మీకినగర్ వద్దకు రాగానే స్కూల్ బస్సును వెనుక నుంచి లారీ ఢీకొని, ఎదురుగావస్తున్న కారును సైతం ఢీకొట్టింది. దీంతో బస్సు వెనుక భాగం ధ్వంసమై అద్దం పగిలిపోయింది. దీంతో విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి, ఈ ఘటనలో కారు ధ్వంసమైంది. కొద్ది తేడాతో కారులోని వ్యక్తులు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న స్థానికులు.. లారీలు గ్రామంలోకి రావొద్దని ఎన్నిసార్లు ఆందోళన చేసినా పట్టించుకునే నాథుడే లేడన్నారు. లారీల లారీలను గ్రామంలోకి రానివ్వద్దని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. లారీని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

బురద మడిలో కుప్పకూలి రైతు మృతి

ఐనవోలు, జూలై 30: బురదమడిలో కుప్పకూలి రైతు మృతిచెందిన సంఘటన వెంకటాపురంలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, స్థానికుల కథనం ప్రకారం.. డోలీల సంపత్(54) అనే రైతు మంగళవారం మధ్యాహ్నం గ్రామ శివారులో ఉన్న తన పొలం వద్దకు వెళ్లాడు. రెండు, మూడు రోజుల్లో పొలంలో నాటువేయాల్సి ఉండగా బురదమళ్లలో నీటిని పరిశీలిస్తూ గట్టుపై నుంచి నడుచుకుంటు వెళ్తూ బురదమడిలో బోర్లపడిపోయాడు. కొద్ది దూరంలో ఉన్న రైతులు అటుగా వచ్చి చూసేవరకు బురదమడిలో తల కూరుకుపోయి ఉన్నాడు. వారువచ్చి లేపే ప్రయత్నం చేయగా అప్పటికే మృతిచెందాడు. కుటుంబసభ్యులకు సమాచారం అందించగా మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. కాగా, సంపత్ గుండెపోటుతోనే మృతిచెందినట్లు కుటుంబసభ్యులు, గ్రామస్థులు భావిస్తున్నారు. మృతుడికి భార్య లక్ష్మి, ఒక కుమారుడు ఉన్నారు. ఇంటి పెద్ద మృతిచెందడంతో కుటుంబంలో విషాదం అలుముకుంది.

నర్సింగ్ ఆఫీసర్ల బదిలీ ఉత్తర్వులు విడుదల

వరంగల్ మెడికల్, జూలై 30: వైద్య, ఆరోగ్యశాఖ నాలుగో జోన్ పరిధిలోని నర్సింగ్ ఆఫీసర్స్ బదిలీ ఉత్తర్వులు మంగళవారం వెలువడ్డాయి. సీనియారిటీ జాబితాలో తప్పుల తడకలు, యూనియన్ ఆఫీస్ బేరర్స్ లేఖలు, ధర్నాలు, రాస్తారోకోలు, కౌన్సెలింగ్ సమయంలో జరిగాయి. హైదరాబాద్‌లో జరిగిన కౌన్సెలింగ్‌కు ఎంజీఎంకు చెందిన నర్సింగ్ ఆఫీసర్లు అందరూ వెళ్లడంతో నర్సింగ్ విద్యార్థులతో రోగులకు సేవలు అందించారు. వెంటనే విధుల్లో చేరాలని ఉత్తర్వులో పేర్కొనడంతో నాలుగో జోన్‌లోని నర్సింగ్ ఆఫీసర్లు అందరూ కొత్త పోస్టింగ్ బాట పట్టారు. కౌన్సెలింగ్‌లో కోరుకున్న చోటు కాకుండా మరో చోటు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేశారని మరికొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, 78మంది నర్సింగ్ ఆఫీసర్లను అధికారులు స్థానచలనం కల్పించారు.

వృత్తి నైపుణ్య శిక్షణకు 23 మంది ఎంపిక

కేయూ క్యాంపస్, జూలై 30: కాకతీయ యూనివర్సిటీలో 23 మందిని నెల రోజుల వృత్తి నైపుణ్య శిక్షణ ఇప్పించేందుకు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేయూ ఇంగ్లీష్ లాంగ్వేజ్ అండ్ టీచింగ్ సెంటర్ నేతృత్వంలో నాలుగు వారాల పాటు 23 మందికి బిల్డింగ్ కెపాసిటీ, ఇంగ్లిష్ గ్రామర్, కంప్యూటర్ స్కిల్స్, ఆఫీస్ ప్రొసీడింగ్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తారు. వీరిలో క్లర్క్స్ కం టైపిస్టులు, జూనియర్ అసిస్టెంట్లు, స్టోర్ కీపర్స్, ల్యాబ్ అసిస్టెంట్స్, డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఉన్నారు. ప్రతీ రోజు సాయంత్రం 4 గంటల నుంచి 6గంటల వరకు తరగతులకు హాజరుకావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే ప్రిన్సిపాల్ ఖాతా నుంచి ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున సెల్ఫ్ కార్యాలయానికి చెల్లించాలని వివరించారు. కేయూ పీఆర్‌వో, ఏఆర్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్‌ను సమన్వయకుడిగా నియమించారు.

బదిలీల్లో ఆఫీస్ బేరర్ల లేఖలు అసంబద్ధం

ఆర్జేడీకి ఫిర్యాదు చేసిన సీనియర్ అసిస్టెంట్

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 30: విద్యాశాఖలో ఇటీవల నిర్వహించిన బోధనేతర సిబ్బంది బదిలీల్లో ఆఫీస్ బేరర్ల లేఖలు అసంబద్ధంగా ఉన్నాయని ఖమ్మం డీఈవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న టి.గాయత్రిదేవి ఆరోపించారు. ఆఫీస్ బేరర్ల అసంబద్ధ లేఖలతో తనకు అన్యాయం జరిగిందంటూ ఆమె మంగళవారం హనుమకొండలోని పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం బదిలీల ఉత్తర్వులు వెలువరిచిన తర్వాత యూనియన్ ఆఫీస్ బేరర్‌గా జారీ చేసిన లేఖలు లెక్కా పత్రం లేకుండా ఉన్నాయని విమర్శించారు. లేఖలను అభ్యర్థుల పేరున వ్యక్తిగతంగా ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమన్నారు. బదిలీల నిబంధనల మేరకు 40 శాతంలో తాను రానప్పటికీ అక్రమ మార్గంలో నలుగురు సహోద్యోగులు టీఎన్‌జీవోస్ ఆఫీస్ బేరర్లుగా లేఖలు సమర్పించడంతో తాను హనుమకొండ నుంచి ఖమ్మం జిల్లాకు బదిలీ అయ్యానని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు యూనియన్ ఆఫీస్ బేరర్లు అయినప్పటికీ స్టేషన్ సీనియారిటీలో ఆరేళ్లుంటే వారిని తప్పకుండా బదిలీ చేయాల్సిందేనని ఉన్నప్పటికీ అధికారులు ఆ నిబంధనను విస్మరించారని ఆరోపించారు. ఇలాంటి పొరపాట్లే రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలో జరిగితే ఆఫీస్ బేరర్ల లేఖలు సమర్పించిన వారిని నిబంధనల మేరకు బదిలీలు చేశారన్నారు. ఉద్యోగుల బదిలీల నిబంధనలు డిపార్ట్‌మెంట్‌కు ఒక విధంగా ఉంటాయా? అని ఆమె ప్రశ్నించారు. అసంబద్ధంగా, అక్రమ మార్గంలో ఆఫీస్ బేరర్ల లేఖలను తీసుకురావడంతోనే బదిలీల్లో తనకు అన్యాయం జరిగిందంటూ ఆమె ఆరోపించారు. వైద్యశాఖలో అధికారులు చేపట్టిన చర్యల్లాగా విద్యాశాఖలోనే అలాంటి చర్యలు చేపట్టి తనకు న్యాయం చేయాలని ఆమె అధికారులను వేడుకుంది. తాను ఈ విషయంపై రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శితో పాటు డైరెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నానన్నారు.

అయ్యో.. రామా!

- అయోధ్య సరయూ నదిలో జనగామ యువతి గల్లంతు
- బాలరాముడి దర్శనానికి వెళ్లిన క్రమంలో ఘటన
- నదీస్నానం చేస్తూ కొట్టుకుపోయిన ఐదుగురు
- నలుగురిని కాపాడిన రెస్క్యూ టీమ్


అయోధ్యకు వెళ్లే ముందు హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో ఫొటో దిగిన నాగరాజు కుటుంబసభ్యులు, గల్లంతైన తేజశ్రీ (ఇన్‌సెట్లో)

జనగామ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అయోధ్య బాలరాముడి దర్శనానికని సంతోషంగా వెళ్లిన ఆ కుటుంబానికి దేవుడు తీరని శోకాన్ని మిగిల్చాడు. నీటి ప్రవాహం రూపంలో వచ్చిన మృత్యువు కళ్ల ముందే కూతురును బలితీసుకుంది. కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా నదీస్నానం చేస్తున్న యువతిని సరయూ నది మింగేసింది. ఈ హృదయ విదారక సంఘటన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్య లక్ష్మణ కిలా ఘాట్ వద్ద జరిగింది. లక్ష్మణ ఘాట్‌లో స్నానం చేస్తున్న జనగామకు చెందిన యువతి సరయూ నదిలో గల్లంతైంది. జనగామకు చెందిన తాళ్లపల్లి నాగరాజు ఉపాధి కోసం జనగామలోని సిద్దిపేట రోడ్డులో వాటర్ ప్లాంట్ నడుపుతున్నాడు. కుటుంబ సభ్యులందరితో అయోధ్య, కాశీ యాత్ర చేయాలని నిర్ణయించుకున్నారు. తన భార్య జయసుధ, కూతుళ్లు తేజశ్రీ, తరుణితో పాటు సోదరులు చంద్రశేఖర్, చందు కుటుంబ సభ్యులతో కలిసి అయోధ్య, కాశీ యాత్రకు వెళ్లారు. ఆదివారం రాత్రి విమానంలో హైదరాబాద్ నుంచి అయోధ్యకు చేరుకున్నారు. సోమవారం ఉదయం అయోధ్య బాలరాముడి దివ్య దర్శనం పూర్తి చేసుకున్నారు. తర్వాత కాశీకి వెళ్లేముందు అయోధ్యలోని సరయూ నది ఒడ్డున ఉన్న లక్ష్మణ ఘాట్‌లో నదీస్నానం చేస్తుండగా ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరిగిపోయింది. దీంతో ఘాట్‌లో సాన్నం చేస్తున్న ఐదుగురు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయారు. ఆ సమయంలో అక్కడే ఉన్న రెస్క్యూ టీమ్ స్పందించి నలుగురిని కాపాడింది. నీటిప్రవాహం మరింతగా పెరగడంతో నాగరాజు పెద్దకూతురు తేజశ్రీ(17) నీటిలో కొట్టుకుపోయింది. సోమవారం ఉదయం ఈ ఘటన జరగగా మంగళవారం రాత్రి వరకు యువతి ఆచూకీ లభ్యం కాలేదు. సరయూ నదిపై ఉన్న డ్యామ్ గేట్లు ఎత్తడం వల్ల నీటి ప్రవాహం పెరిగి ఉంటుందని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. కాగా.. తేజశ్రీ జనగామలోని ఏబీవీ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది.

కన్నీరుమున్నీరుగా..

కళ్లముందే కూతురు గల్లంతు కావడంతో ఆ తల్లితండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఊరు కాని ఊరులో తమ బిడ్డ ఆచూకీ లభ్యం కావాలని, ప్రాణాలతో బయట పడాలని ఆ అయోధ్య రాముడిని తలచుకుంటూ ఆ కుటుంబ సభ్యులు సరయూ నది ఒడ్డునే బిక్కు బిక్కుమంటూ గడుపుతున్నారు. అప్పటిదాకా అందరితో సంతోషంగా, నవ్వుతూ గడిపిన కూతురు గల్లంతు కావడం ఆ తల్లితండ్రులకు, కుటుంబ సభ్యులకు తీరని దుఃఖాన్ని మిగిల్చింది.

యూపీ అధికారులకు బండి సంజయ్ లేఖ

యువతి గల్లంతు విషయాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లారు. వారు బాధిత కుటుంబ సభ్యులతో ఫోన్లో మాట్లాడారు. యూపీ అధికారులకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ లేఖ రాశారు. యువతి ఆచూకీని త్వరగా కనుక్కోవాలంటూ అయోధ్య కలెక్టర్ చంద్ర విజయ్‌సింగ్, అయోధ్య ఎస్పీ రాజ్ కరణ్ నాయర్, యూపీ ముఖ్యమంత్రి ఓఎస్డీకి సూచించారు.


ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న రావుల వెంకట్‌రెడ్డి

వికలాంగులకు ఉచితంగా మూడెకరాల భూమి ఇవ్వాలి

వడ్డెపల్లి, జూలై 30: వికలాంగులందరికీ జీవోనంబర్ 56 ప్రకారం ఉచితంగా మూడెకరాల భూమి ఇవ్వాలని దివ్యాంగుల సేవా సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రావుల వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు దివ్యాంగుల సేవా సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బండిస్వరూప, రాష్ట్ర సలహాదారుడు సమ్మెట వేణుగోపాల్ మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిన విధంగానే దివ్యాంగులకు సైతం ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని అన్నారు. బ్యాంకులతో నిమిత్తం లేకుండా రూ.10లక్షల రుణాలను ఇవ్వాలని కోరారు. సమావేశంలో దివ్యాంగుల సేవా సంఘం జిల్లా నాయకులు రాజ య్య, మహాలక్ష్మి, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

బస్సు నడిపేటప్పుడు డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝూ

బాలసముద్రం, జూలై 30: బస్సు నడిపేటప్పుడు డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝూ సూచించారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిర్వహిస్తున్న ప్రమాద రహిత వారోత్సవాలను వరంగల్ 1డిపోలో ముగింపు వేడుకలను వరంగల్ ఆర్టీసీ రిజినల్ మేనేజర్ డి.విజయభాను ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝూ పాల్గొని ఆర్టీసీ రీజినల్ పరిధిలో 9 డిపోల నుండి ఆర్టీసీ విధులలో ప్రతిభ కనబరిచిన డ్రైవర్లను ఇతర సిబ్బందిని శాలువాతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. బస్సు నడుపుతున్నప్పుడు జాగ్రత్తగా నడపాలని సూచించారు. ఆర్‌ఎం డి.విజయభాను మాట్లాడుతూ.. అత్యధిక సర్వీస్ కలిగి ప్రమాదరహిత డ్రైవర్లుగా అవార్డులు అందుకున్న డ్రైవర్లందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎంలు కె.భానుకిరణ్, మాధవరావు, రీజియన్‌లోని 9 డిపోల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్టు



నిందితులను చూపుతున్న పోలీసులు

దేవరుప్పుల, జూలై 30: మండలకేంద్రంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్‌పంప్‌లో ఇటీవల డబ్బు దొంగిలించిన వారిని దేవరుప్పుల పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 27న అర్ధరాత్రి దేవరుప్పుల ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్‌లో దొంగలు పడి రూ.30వేలు ఎత్తుకెళ్లారు. దేవరుప్పుల ఎస్సై సృజన్‌కుమార్ మంగళవారం సీతారాంపురం ఎక్స్‌రోడ్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పందంగా కనిపించిన ఆటోను ఆపారు. అందులో ఉన్న చిలుపూర్ మండలం రాజవరం గ్రామానికి చెందిన ఎడ్ల మోజేస్, ఇల్లందుల ప్రసాద్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా పెట్రోల్‌పంప్‌లో దొంగతనం చేసింది తామేనని అంగీకరించారు. దీంతో వారి వద్ద రూ. 30వేలతో పాటు ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను జనగామ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరుస్తామన్నారు. మూడు రోజుల్లోనే దొంగతనం కేసును ఛేదించిన ఎస్సై సృజన్‌కుమార్, సిబ్బందిని డీసీపీ మహేంద్రనాయక్ అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్సై సదానందం, హోంగార్డులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల కోసమే కార్డన్ సెర్చ్

జనగామ ఏసీపీ పార్థసారథి

జనగామ రూరల్, జూలై 30: శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని జనగామ ఏసీపీ పార్థసారథి అన్నారు. జిల్లా కేంద్రంలోని వీవర్స్ కాలనీలో జనగామ పోలీసులు మంగళవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై దృష్టి పెట్టాలన్నారు. అపరిచిత వ్యక్తులు ఎవరైనా ఉంటే తక్షణమే పోలీసులకు సమచారం అందించాలన్నారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 15 ద్విచక్ర వాహనాలు, రూ. 6000 విలువ గల మద్యం బాటిళ్లు, ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు ఆటోను సీజ్ చేశామని తెలిపారు. కార్యక్రమంలో సీఐ రఘుపతి రెడ్డి, ఎస్సైలు భరత్, చెన్న కేశవులు, ఏఎస్సైలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల పొలంబాట

బచ్చన్నపేట, జూలై 30: మండలంలోని బండనాగారం, లక్ష్మాపూర్ గ్రామాల్లో మంగళవారం విద్యుత్ అధికారులు పొలంబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ విద్యుత్ సంస్థ లైన్ల ఆధునికరణ కింద కేశిరెడ్డిపల్లి, బసిరెడ్డిపల్లి, పోచన్నపేటలోని మూడు ఫీడర్లను రూ. 5 కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. మిడిల్ పోల్స్, డ్యామేజ్ పోల్స్, లెంత్ సర్వీసులు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు బిగించటం తదితర పనులు చేశామన్నారు. ఇపుడు విద్యుత్ సరఫరా ఎలా ఉందని రైతులను అడిగారు. రైతులు ప్రతీ మోటర్‌కు కెపాసిటర్లు వాడాలన్నారు. కార్యక్రమంలో డీఈ లక్ష్మీనారాయణరెడ్డి, ఏడీఈ వేణుగోపాల్, ఏఈ రాజ్‌కుమార్, సబ్ ఇంజనీర్ అజయ్‌కుమార్, లైన్ ఇన్స్‌పెక్టర్లు, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల ముందస్తు అరెస్ట్

జఫర్‌గడ్/బచ్చన్నపేట, జూలై 30 : పంచాయతీ కార్మికులను మంగళవారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం జీపీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ అనుబంధ తెలగాణ జీపీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం హైద్రాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ధర్నాకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నమవుతాయన్న కారణంగా జీపీ కార్మికులు ధర్నాకు వెళ్లకుండా పోలీసులు అరెస్ట్ చేశారు. అదేవిధంగా బచ్చన్నపేటలో చలో హైదరాబాద్‌కు వెళుతున్న గ్రామ పంచాయతీ సిబ్బందిని పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

పాఠశాలల్లో విద్యార్థులకు తిథి భోజనాలు



జఫర్‌గడ్ మండలం కూనూరు ప్రాథమిక పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

జఫర్‌గడ్, జూలై 30: మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు తిథి భోజనాల కార్యక్రమాలు నిర్వహించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు 'శిక్షా సప్తాహ్' ముగింపు సందర్భంగా దాతల సహకారంతో విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేశారు. మంగళవారం మండలంలోని కూనూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గ్రామస్థుల సహకారంతో నిర్వహించిన తిథి భోజన కార్యక్రమంలో హెచ్‌ఎం కె.సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం, కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోమయ్య, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

లింగాలఘణపురం: నవాబుపేట జడ్పీహైస్కూల్ విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బూడిద జయరాజేశ్వర్ ఆధ్వర్యంలో మంగళవారం తిథి భోజనం పెట్టారు. అరటిపండ్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు ప్రోటీన్లు, విటమిన్లతో కూడిన ఆహారంతో పాటుగా పండ్లు, బిస్కెట్లను అందజేయాలనుకునే వారి కోసం ప్రభుత్వం తిథిభోజన్ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా విద్యార్థులకు భోజనసదుపాయం కల్పించదల్చిన వాళ్లు పుట్టినరోజు, పెళ్లిరోజుతో పాటుగా ఇతరత్రా ప్రత్యేక కార్యక్రమాల రోజున భోజనం గానీ పండ్లను గానీ అందజేయవచ్చని పిలుపునిచ్చింది. కాగా నవాబుపేట హెచ్‌ఎం సత్యనారాయణ సూచన మేరకు మాజీ సర్పంచ్ దంపతులు మధ్యాహ్న భోజన సమయంలో పండ్లను పంపిణీ చేసి తమ దాతృత్వ హృదయాన్ని చాటుకున్నారు.

బచ్చన్నపేట: సమాజ భాగస్వామ్యాన్ని పోత్సహించటానికి ప్రభుత్వ పాఠశాలల్లో తిథి భోజనం అందించే కార్యక్రమం ప్రారంభించామని నోడల్ ఆఫీసర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని అన్ని పాఠశాలల్లో దాతల సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. విద్యార్థులకు స్వీట్లు, పండ్లు అందించారు. ప్రారంభం రోజున అనేక మంది దాతలు ముందుకు వచ్చారని తెలిపారు. కెశిరెడ్డిపల్లిలో కాపర్తి హరిప్రసాద్, బండనాగారంలో ఎర్రోజు శ్రీనివాస్‌తో పాటు గ్రామాల్లో దాతల సహకారంతో తిథి బోజనాన్ని అందించారు.

చిలుపూర్: తిథి భోజన కార్యక్రమానికి దాతలు సహకరించడం అభినందనీయమని హెచ్‌ఎం కేతిరి నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం పల్లగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తిథి భోజన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రిటైర్డ్ హెచ్‌ఎం పసునూరి వెంకట్‌రెడ్డి సహకారంతో విద్యార్థులకు అరటిపండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం నర్సింహారెడ్డి మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు ప్రతీ నెల చివరి వారంలో ఈ కార్యక్రమం చేపడుతున్నందున దాతలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, కోమలి, నరసింహారావు, ప్రకాశ్, సురేశ్, లక్ష్మి, అలకనంద, శోభారాణి, రమేష్, అరుణదేవి, దేవ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

తండాల్లో ఘనంగా సీత్లా పండుగ



అజ్మీరా తండాలో వనదేవతల వద్దకు ర్యాలీగా వెళుతున్న గిరిజన మహిళలు



శంకర్‌బాయి తండాలో సీత్లా భవాని దేవతకు నైవేద్యం పెడుతున్న మహిళలు

జనగామ రూరల్, జూలై 30: మండలంలోని అజ్మీరా తండాలో గిరిజనులు సీత్లా పండుగను మంగళవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వనదేవతలు కరుణించాలని, విరివిగా వర్షాలు కురవాలని, పాడిపంటలతో గ్రామాలు చల్లగా ఉండాలని దేవతలను వేడుకుంటూ గిరిజనులు ప్రత్యేక పూజలు చేశారు. డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ పొలిమేరలో ఉన్న దేవతలకు నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో నరేందర్, కుమార్, సురేష్, హర్యా, నాగేష్, కమలమ్మ, సరోజ, నిర్మల, శారద తదితరులు పాల్గొన్నారు.

నర్మెట: ఆషాడమాసంలో గిరిజనులు జరుపుకునే సీత్లా భవాని(దాటుడు) పండుగను మండలంలోని సూర్యబండతండ శివారు శంకర్‌భాయి తండా ప్రజలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామ పొలిమేరలో గిరిజనుల ఆరాధ్య దేవతలు ఏడుగురిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. దేవతల వద్దకు సమూహంగా వెళ్లి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు బాగా కురవాలని, పంటలు సమృద్ధిగా పండాలని, తమ కుటుంబాలు ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో సేనావత్ రాజేందర్, రవీందర్‌నాయక్, బిక్కునాయక్. నరేందర్‌నాయక్, మహిళలు పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో రుణమాఫీ సంబరాలు



బచ్చన్నపేటలో మిఠాయిలు పంచుతున్న కాంగ్రెస్ శ్రేణులు

బచ్చన్నపేట, జూలై 30: కాంగ్రెస్ ప్రభుత్వం మంగళవారం రూ. 1.50 లక్షల లోపు ఉన్న రైతులకు రుణమాఫీ చేయటంతో మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద రైతులు, కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లను పంచుకుని సీఎంకు అనుకూలంగా నినాదాలు చేశారు. ఏడాది గడవక ముందే ఇచ్చిన హామీలను డెబ్బై శాతం అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. రైతు వేదికలో తహసీల్దార్ విశాలాక్షీ, ఏవో విద్యాకర్‌రెడ్డికి మిఠాయిలు తినిపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నూకల బాల్‌రెడ్డి, జంగిటి విద్యానాథ్, నిడిగొండ శ్రీనివాస్, మాసపేట రవీందర్‌రెడ్డి, నల్లనాగుల వెంకటాచారి, నల్లగోని బాలకిషన్‌గౌడ్, గుర్రపు బాల్‌రాజు, ఎండీ మసూద్, జ్యోతి భాస్కర్, దిడిగ రమేశ్, మట్టి బాల్‌రాజు, గంగం బుచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'తపాలా సేవలను వినియోగించుకోవాలి'

దేవరుప్పుల, జూలై 30: తపాలాశాఖ అందించే పలు పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని జనగామ ఈస్ట్ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రవి సూచించారు. మంగళవార ఆయన మాధాపురంలో నిర్వహించిన డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో మాట్లాడారు. మహిళలకు, వృద్ధులకు, చిన్నపిల్లలకు, అన్ని వర్గాల పౌరులకు తపాలా ద్వారా పొదుపు పథకాలు, బీమా పథకాలు, ఆధార్‌సేవలు, ఐపీపీబీ బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నామని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోస్టు మాస్టర్లు యాదయ్య, ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు సీనియర్ మేనేజర్ జైల్‌సింగ్, చీమలపాటి భాస్కర్, మండలంలోని అన్ని గ్రామాల బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు పెంచాలి: డీఈవో

లింగాలఘణపురం, జూలై30: విద్యాప్రమాణాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి రాము అన్నారు. మంగళవారం ఆయన లింగాలఘణపురంలో నిర్వహించిన ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తెచ్చేందుకు ప్రతీ ఉపాధ్యాయుడు కంకణబద్ధులై పనిచేయాలని, విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు పాటుపడాలని సూచించారు. ప్రతీ విద్యార్థి అభ్యసనాభివృద్ధిపై దృష్టిసారించాలని సూచించారు. నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి అధ్యక్షత నిర్వహించిన ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మల్లికార్జున్, రిసోర్స్‌పర్సన్లు నరేందర్, ప్రభాకర్, కోటి రాఘవులుతో పాటుగా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'జనగామ-జీడికల్ రోడ్డుకు మరమ్మతు చేయాలి'



జీడికల్-జనగామ రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

లింగాలఘణపురం, జూలై30: మండలంలో అధ్వాన్నంగా తయారైన జీడికల్ - జనగామ బీటీరోడ్డును వెంటనే మరమ్మతు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం కార్యకర్తలు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. గడిచిన పదేళ్లుగా ఈ బీటీ రోడ్డు గుంతలు పడి నరకం చూపిస్తోందన్నారు. ఇప్పటికే అనేక ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్ర చేసి అప్పటి ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇచ్చినా ఇప్పటివరకు రోడ్డు మరమ్మతుకు నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ప్రజల సౌకర్యార్థం బీటీరోడ్డుకు నిధులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తూటి దేవదానం, నెల్లుట్ల యాదగిరి, బొంగు రాజు, గుండెబోయిన బాలయ్య, బాలమ్మ, బిక్షపతి, రాంనర్సయ్య, రాములు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళ వైద్యానికి కొమ్మూరి సాయం

జనగామ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జనగామకు చెందిన పేద మహిళ పట్ల డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మానవత్వాన్ని చూపారు. బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళ వైద్యానికి సాయం అందించారు. జనగామకు చెందిన సనా బేగం బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు ఖరీదైన ఇంజక్షన్ ఇవ్వాలని వైద్యులు సూచించారు. ఆమెకు అంత ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఆమె భర్త విజ్ఞప్తి మేరకు ఇంజక్షన్ కొనుగోలు కోసం డబ్బులు పంపారు. అదేవిధంగా తదుపరి చికిత్స కోసం అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

ఇసుక లారీ పట్టివేత

రఘునాథపల్లి, జూలై 30: అనుమతులు లేకుండా ఏటూరునాగారం నుంచి హైదరాబాద్‌కు ఇసుక తరలిస్తున్న లారీని కోమల్ల టోల్ గేట్ వద్ద పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. లారీ యాజమాని రామిడి మహిపాల్ రెడ్డి, డ్రైవర్ కట్రోత్ విజయ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.నరేష్ తెలిపారు.

నాస్ పరీక్షలో ప్రతిభ చూపాలి

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జూలై 30: నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(నాస్) పరీక్షలో 3,6,9 తరగతుల విద్యార్థులు ముందంజలో నిలిచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల నోడల్ అధికారి జి.కొమురయ్య కోరారు. మంగళవారం స్టేషన్‌ఘన్‌పూర్ హైస్కూల్‌లో నిర్వహించిన పీఎస్ లెవల్ కాంప్లెక్స్, బయోలజీ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాస్‌లో జిల్లా రాష్ట్ర స్థాయిలో కొంత మెరుగ్గా ఉన్నా, జాతీయ స్థాయిలో వెనక బడి ఉందన్నారు. నాస్‌లో 3,6,9 తరగతులకు జాతీయ స్థాయిలో పరీక్ష నిర్వహిస్తారని, దానిలో విద్యార్థులు రాణించేలా పాఠ్యాంశాలు బోధిస్తూ ప్రశ్నలు అభ్యాసం చేయించాలన్నారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఎం.సంపత్, కె.రమేశ్, ఆర్‌పీలు కె.రాజు, విజయేందర్ రెడ్డి, పీఎస్ హెచ్‌ఎంలు జి.శ్రీధర్, మల్లారెడ్డి, సదామోహన్, ఆర్‌పీలు బి.రాజేందర్, మధుబాబు, మంజుల తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీహెచ్‌వోగా వెంకటస్వామి

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జూలై 30: స్టేషన్‌ఘన్‌పూర్ క్లస్టర్ ఆసుపత్రికి డిప్యూటీ సీహెచ్‌వోగా పదోన్నతిపై వచ్చిన చింత వెంకటస్వామి మంగళవారం విధుల్లో చేరారు. దేవరుప్పుల పీహెచ్‌సీలో పని చేస్తున్న వెంకటస్వామి ఇక్కడ విధుల్లో చేరిన సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు, అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రజలను చైతన్యం చేస్తామన్నారు.

దోమలను నివారించాలి: బీజేపీ

జఫర్‌గడ్, జూలై 30 : దోమల నివారణకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేశ్ గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం జఫర్‌గఢ్ ఇంచార్జీ తహసిల్దార్ బాసెట్టి హరిప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం నాగేశ్ గౌడ్ మాట్లాడుతూ మండలంలో కురుస్తున్న ముసురు వర్షాల వల్ల అపరిశుభ్రత, నీటి గుంటల్లో మురికి నీరు చేరడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణకు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేరెళ్ల రాజు, కత్తి సందీప్‌గౌడ్, గాదెపాక శ్రీను, వేముల రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి

జనగామ కల్చరల్, జూలై 30: విజ్ఞాన భారతి స్వచ్ఛంద సంస్థ ఎస్‌సీఈఆర్టీ సౌజన్యంతో నిర్వహించే విద్యార్థి విజ్ఞాన మంథన్ ఆన్‌లైన్ పరీక్షలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జనగామ ఏఎంవో బి.శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు మంగళవారం జనగామ జిల్లా కేంద్రంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా అక్టోబరు 23, 27 తేదీలలో నిర్వహించే ఈ పరీక్షకు జిల్లాలోని 6 నుంచి ఇంటర్ వరకు విద్యార్థులందరూ సెప్టెంబరు 15 లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

ఎమ్మార్పీ సిబ్బంది అరెస్ట్

దేవరుప్పుల, జూలై 30: సమగ్ర శిక్ష తెలంగాణ ఉద్యోగులు చేపట్టిన నేటి అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న ఎమ్మార్పీ సిబ్బందిని మంగళవారం దేవరుప్పుల పోలీసులు అరెస్ట్ చేశారు. కార్యక్రమంలో గోలి రవీందర్ రెడ్డి, యాకస్వామి, యాకయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

'హక్కులను కాలరాస్తున్న బీజేపీ'

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 30: ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బొట్ల శేఖర్ విమర్శించారు. మంగళవారం ఆయన డివిజన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన కేవీపీఎస్ సమావేశంలో మాట్లాడారు. సమాజంలో అట్టడుగు వర్గానికి చెందిన పేదలు అభివృద్ధికి నోచుకోలేక పోతున్నారని అన్నారు. అసమానతలు తొలగిపోవాలంటే ప్రతీ కుటుంబానికి భూమి పంపిణీ జరగాలన్నారు. కులం, మతం పేరుతో బీజేపీ ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను సమాధి చేస్తోందన్నారు. సమాజంలోని అసమానతలను అంతం చేయడానికి కేవీపీఎస్ కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మంద మహేందర్, మారపాక రమేష్, గడ్డం యాదగిరి, ఆసీయా సుల్తానా, ఇల్లెందుల మహేష్ పాల్గొన్నారు.

'లెదర్‌పార్కును వినియోగంలోకి తేవాలి'

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 30: డివిజన్ కేంద్రంలో 22ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన మినీ లెదర్‌పార్కును వినియోగంలోకి తేవాలని కోరుతూ జిల్లా చర్మకారుల సంక్షేమ సంఘం బాధ్యులు మంగళవారం ఎస్సీ కార్పోరేషన్ చైర్మన్ నాగరిగిరి ప్రీతమ్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. హైదరాబాద్‌లో కలసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చర్మకారులు పడుతున్న ఇబ్బందులను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాజరపు మల్లేషం, మారపాక శ్రీనివాస్, చేపూరి కుమార్, ప్రవీన్, గాదె ఈశ్వరయ్య, బాస్కుల వెంకటయ్య, జీడి యాకయ్య, అరూరి కుమార్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

గోడపైనుంచి జారి పడి తాపీ మేస్త్రి మృతి

జఫర్‌గడ్, జూలై 30 : భవన నిర్మాణ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు జారి పడి మండల కేంద్రానికి చెందిన తాపీ మేస్త్రీ తాటికాయల యాదగిరి (46) మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. జఫర్‌గడ్ శివారు వడ్డెగూడెంనకు చెందిన యాదగిరి మంగళవారం అదే గ్రామంలో సుమారు 20 ఫీట్ల ఎత్తులో గోగ కట్టెలపై కూర్చుని సిమెంట్ పని చేస్తున్నాడు. ఈ క్రమంలో జారి కింద పడ్డాడు. తల, శరీరంపై బలంగా దెబ్బలు తగలడంతో యాదగిరి అక్కడికక్కడే చనిపోయాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కార్మిక సంఘం ప్రతినిధులు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బచ్చన్నపేట, జూలై 30: పోచన్నపేట వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను తహసీల్దార్ విశాలాక్షీ మంగళవారం పట్టుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాగు నుంచి ఇసుకను తరలిస్తున్నారని, వారి చర్యలను ఉపేక్షించేది లేదని అన్నారు. ట్రాక్టర్ల యజమానులలకు రూ.3 వేలచొప్పున జరిమానా విధించినట్టు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పాలకుర్తి, జూలై 30 : ఇటీవల మండల కేంద్రానికి చెందిన సలేంద్ర సోమశేఖర్ మృతి చెందగా ఆ కుటుంబాన్ని రాష్ట్ర ఫర్టిలైజర్ డీలర్ల సంఘం ఆదుకుంది. అసోసియేషన్ అధ్యక్షుడు గౌరిశెట్టి మునిందర్ ఆధ్వర్యంలో మంగళవారం రూ. 31 వేలు అందచేశారు. కార్యక్రమంలో పజ్జూరి గోపయ్య, చిలువేరు సదానందం, నాళ్ల సోమసుందరం, భూపాల్ రావు, రాపాక సత్యనారాయణ, డీలర్లు పాల్గొన్నారు.

'ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కరించాలి'

పాలకుర్తి, జూలై 30 : ముదిరాజు కులస్థుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ముదిరాజ్ మహాసభ మండల కమిటీ నాయకులు తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ముదిరాజ్‌లను బీసీడీ నుంచి బీసీఏలో చేర్చాలని, 75 శాతం సబ్సిడీతో రుణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చిక్కుడు రాములు, మాచెర్ల ఎల్లయ్య, నరేష్, కొంరయ్య, శ్రీనివాస్, ఎం.కుమార్, సోమయ్య, రవి, రాములు, గట్టయ్య, సంపత్ ఉన్నారు.

పీఏసీఎస్ వైస్ చైర్మన్‌కు పరామర్శ

చిలుపూర్, జూలై 30: మండలంలోని పల్లగుట్టలో అనారోగ్యంతో బాధపడుతున్న పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజును కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పొట్లపల్లి శ్రీధర్‌రావు పరామర్శించారు. మంగళవారం స్థానిక నేతలతో కలిసి నాగరాజు ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్నారు. శ్రీధర్‌రావు వెంట దార రాజు, ఎనగందుల రత్నాకర్ రెడ్డి, అశోక్‌పాల్, ఇసురం క్రిష్ణ, రజనీకుమార్, రాజ్‌కుమార్ ఉన్నారు.

'జర్నలిస్టులను విస్మరించిన ప్రభుత్వాలు'

జనగామ కల్చరల్, జూలై 30: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని మాదిగ జర్నలిస్టుల ఫోరం (ఎంజేఎఫ్) జాతీయ ఇన్‌చార్జి తిప్పారపు లక్ష్మణ్ మాదిగ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వైఎస్ఎస్ఆర్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల సంక్షేమాన్ని, సమస్యల్ని ప్రభుత్వాలు విస్మరించాయన్నారు. తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, డబుల్ బెడ్ రూం ఇండ్లు, ఇండ్ల స్థలాలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఎంజేఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామన్నారు. సీనియర్ జర్నలిస్టు కాసాని ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంజేఎఫ్ నాయకులు గాదె రమేష్, కుమార్, రాష్ట్ర బాధ్యులు మనోహర్, గద్దల కిషోర్, పైసా రాజశేఖర్, ఎమ్మార్పీఎస్ నాయకుడు రాగళ్ల ఉపేందర్ పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

వ్యవసాయ కార్మికుల నిరసన

జనగామ రూరల్, జూలై 30: వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సంఘం నాయకులు మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఏవో రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మంగళపల్లి జనార్ధన్ మాట్లాడుతూ భూమి లేని వారికి ప్రభుత్వ భూమి ఇవ్వాలని, 50 సంవత్సరాలు నిండిన వారికి రూ. 5000 పింఛన్ ఇవ్వాలని, ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని, వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవీందర్, రామచంద్రం, ప్రసాద్, రజిత, బుచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు

'పార్టీ గెలుపు కోసం కృషి చేయాలి'

జనగామ రూరల్, జూలై 30: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం ప్రతీ కార్యకర్త సైనికుల్లా పని చేయాలని బీజేపీ భువనగిరి పార్లమెంటు కోకన్వీనర్ కొంతం శ్రీనివాస్ అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం నాయకులు కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలను పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లద్దునూరి మహేశ్, నాయకులు మార్క ఉపేందర్, పిట్టల సత్యం, జంగా నర్సింహారెడ్డి, రాంకోటి తదితరులు పాల్గొన్నారు.

చర్మకారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా మల్లేషం

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 30: రాష్ట్ర చర్మకారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా తాటికొండ గ్రామానికి చెందిన రాజారపు మల్లేషం ఎంపికయ్యారు. మంగళవారం డివిజన్ కేంద్రంలో జరిగిన చర్మకారుల సంక్షేమ సంఘం సమావేశంలో రాష్ట్ర అధ్యక్షురాలు ఇటికాల లత సమక్షంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మారపాక శ్రీనివాస్, ప్రధానకార్యదర్శిగా చేపూరి కుమారస్వామి, సహాయ కార్యదర్శిగా బొట్టు ప్రవీణ్, కోశాధికారిగా గాదె ఈశ్వరయ్య ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మల్లేషం మాట్లాడుతూ చర్మకారుల సమస్యలపై పోరాడుతానన్నారు.

కాంగ్రెస్‌లో భారీగా చేరికలు



బీఎస్పీ నాయకురాలు పంజా కల్పనను ఆహ్వానిస్తున్న ఝాన్సీరెడ్డి

పాలకుర్తి, జూలై 30 : బీఆర్ఎస్, బీఎస్పీ పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో సుమారు వెయ్యి మంది చేరారు. మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో ఝాన్సీరెడ్డి ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ అందె యాకయ్య, గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వరంగల్ పార్లమెంటు బీఎస్పీ పార్టీ నుంచి పోటీ చేసిన పంజా కల్పన, నియోజకవర్గంలోని మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా బృందావన్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నియోజకవర్గంలో కాంగ్రెస్‌దే విజయమని అన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని ఖాళీ చేయాలని సూచించారు. 40 ఏళ్లుగా నియోజకవర్గ ప్రజలు అభివృద్ధి లేక అనేక ఇబ్బందులు పడ్డారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలు ఆదరిస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ లేకుండా చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, శ్రీరామ్, కాకిరాల హరిప్రసాద్, ఎర్రబెల్లి రాఘవరావు, భూమ రంగయ్య, రమేష్ పాల్గొన్నారు.